

# కథా కౌముది

## జీవన సాఫల్యం ఇంద్రగంటి నరసింహమూర్తి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

"ఏమన్నాడు డాక్టర్" అడిగింది భానుమతి ఆసుపత్రి నుండి రాగానే.

"త్వరలో నయమవుతుందన్నారు" చెప్పాడు భర్త వంశీకృష్ణ.

"నన్ను బయటకు పంపి డాక్టర్ మీతో మాట్లాడినప్పుడే అర్థమయింది. నేనింక ఎక్కువ రోజులు బ్రతకనని...అవునా" అడిగింది భానుమతి.

"అబ్బే...అదేంకాదు. నీకు త్వరలో పూర్తి ఆరోగ్యం చిక్కుతుందని నమ్ముతున్నాను" అంటూ బెడ్‌రూములోకి వెళ్ళి కర్ఛీఫ్‌తో కళ్ళు తుడుచుకున్నాడు వంశీకృష్ణ.

"అబ్బా.. కడుపునొప్పి" అంటూ బాధతో మంచంపై కూలబడింది భానుమతి. భార్య బాధ చూసి ఉపశమనానికి మాత్ర ఇచ్చాడు వంశీకృష్ణ. మాత్ర మింగి మంచినీళ్ళు త్రాగి మూలుగుతూ పడుకుంది భానుమతి.

'హు..కంటికి కనపడని కేన్సర్ కణం. సంవత్సరంగా కడుపులో శూలాలు గుచ్చుతోంది. హృదయంలో మంటలు రేపుతోంది. బారెడు జుట్టును కాల్చేసింది. బుగ్గలను పిండేసింది. వళ్ళంతా గుల్ల చేసింది. పాతిక లక్షలు మిగేసింది. మరో వారంలోనో, నెలలోనో ప్రాణాలనూ హరిస్తుంది' అనుకుంటూ వేదనతో మంచంపై అటూ ఇటూ దొర్లింది భానుమతి. సంవత్సరం క్రితం భానుమతి కడుపు నొప్పితో మెలికలు తిరుగుతూంటే పరీక్షించిన డాక్టర్లు పొత్తికడుపు కేన్సర్ మూడో

దశ అని నిర్ధారించి వైద్యం మొదలుపెట్టారు. అంతకుముందు చాలాసార్లు కడుపునొప్పి అని బాధపడుతూంటే గ్యాస్ ప్రాబ్లం అనుకుని మందులు వాడాడు వంశీకృష్ణ. వ్యాధి ప్రారంభ దశలో స్పెషలిస్ట్‌లను సంప్రదిస్తే కొంత ఫలితం ఉండేదని చెప్పారు డాక్టర్లు. తమ వంతు ప్రయత్నం తాము చేస్తామన్నారు. సంవత్సరకాలంలోనే భార్య ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో మనస్తాపానికి గురయ్యాడు వంశీకృష్ణ.

"పేషెంటుకు రోజులు దగ్గర పడ్డాయి. మహా అయితే నెలరోజులు. ఆమెకి ఇష్టమయిన ఆహారాన్నివ్వండి. ప్రశాంతంగా ఉంచండి. బాధ ఎక్కువైనప్పుడు ఈ మాత్రలు వాడండి" ఆ రోజు ఉదయం డాక్టర్ మాటలు విన్న వంశీకృష్ణ హతాశుడయ్యాడు. ఇంటికి వచ్చాక ఆ విషయం భార్యకెలాగ చెప్పాలో తెలియక సతమతమయ్యాడు.

భానుమతికి కేన్సర్ అని తెలిశాక వంటకు మనిషి కుదిర్చాడు వంశీకృష్ణ. మధ్యాహ్నం వంటమనిషి చేత భానుమతికి ఇష్టమైన స్వీట్స్ చేయించాడు. భానుమతి వాటివైపు చూడలేదు. ఆమెకు ఏమీ తినాలనిపించడంలేదు. మనసులో ఆందోళన తన జిహ్వ చాపల్యాన్ని చంపేసింది.

ఆ రాత్రి వంశీకృష్ణ బెడ్‌రూం తలుపు మూసి అమెరికాలో ఉన్న కొడుకు భాస్కరంతో మాట్లాడుతుంటే తలుపు సందుకు చెవి ఆనించి భర్త మాటలు విన్న భానుమతి తాను నెలరోజుల కన్నా ఎక్కువ బ్రతకనని అర్థం చేసుకుంది.

"మన అబ్బాయి పెళ్ళాం పిల్లలతో రెండు రోజుల్లో వస్తున్నాడు. ఈ నెలరోజులు నీతోనే ఉంటాడు. నీతో కబుర్లు చెపుతాడు. నువ్వు మనవలతో ఆడుకోవచ్చు" చెప్పాడు వంశీకృష్ణ బెడ్‌రూం నుండి వచ్చి.

"ఈ నెల రోజులు.... అంటే.... ఇక నేను నెల కన్నా బ్రతకననేగా..." అంది భానుమతి.

"అబ్బే.. ఓ నెలరోజులు అనబోయి ఈ నెల అన్నాను అంతే.." తడబడ్డాడు వంశీకృష్ణ.

"చూశారా.. ఒక అక్షరం తేడాతో అర్థం ఎంత మారిందో. మన జీవితాలూ అంతే.. చిన్న పొరపాటుకు పెద్ద ప్రమాదం ముంచుకొస్తుంది" చెప్పింది భానుమతి.

ఏం సమాధానం చెప్పాలో తెలియక భార్య ప్రక్కనే కూర్చుని మనసులో బాధను కప్పిపుచ్చుకుంటూ భార్య బుగ్గలపై, మెడపై ముద్దులు పెట్టుకున్నాడు భర్త. ఆమె చేతులు నిమిరాడు.

భర్త తనపై చూపిస్తున్న ప్రేమకు కరిగిపోయింది భార్య.

"మిమ్మల్ని ఒంటరిగా వదలి వెళ్ళిపోతున్నాను. నేను పోయాక ఒంటరిగా ఉండకండి. అబ్బాయి ఇంటికి వెళ్ళండి. కోపం తగ్గించుకుని కోడలితో సఖ్యంగా ఉండండి. ఎట్టి పరిస్థితుల్లోనూ కొడుకు కోడలి మనసు నొప్పించకండి. ఇక చివరిదాకా మిమ్మల్ని కనిపెట్టుకునేది కొడుకూ కోడలే.." కన్నీళ్ళు ఉబుకుతూంటే భర్తను కౌగిలించుకుని చెప్పింది భానుమతి.

వంశీకృష్ణ మనసు ద్రవించింది. కన్నీటి వరద ఆపుకోలేకపోయాడు. భార్యాభర్తలు ఒకరినొకరు ఓదార్చుకున్నారు.

ఆ రాత్రి మంచం మీద పడుకున్న భానుమతికి నిద్ర పట్టలేదు. కొద్ది రోజుల్లో శాశ్వత నిద్రకు జారుకోబోతున్న తనకు ఇక రాత్రిళ్ళు నిద్ర పట్టినా పట్టకపోయినా ఆరోగ్యంలో వచ్చే మార్పేమీ ఉండదు కదా అనుకుంటూ నవ్వుకుంది. ఆమె మనసులో గతం మెదులుతోంది. వివాహం కాగానే అత్తారింట్లో అడుగుపెట్టిన నాటి సంఘటనలు కళ్ళముందు మెదిలాయి.

మామగారు కృష్ణారావుగారు 'నిర్మల క్లాత్ షోరూం' ప్రొప్రయిటర్. అతని భార్య నిర్మల. వారి ఏకైక కుమారుడు వంశీకృష్ణ డిగ్రీ  చేసి తండ్రికి వ్యాపారంలో సహాయం చేస్తున్నాడు. అత్తారింట్లో అడుపెట్టిన భానుమతికి ఆ ఇంటి వాతావరణం అలవాటు పడడానికి కొంత సమయం పట్టింది.

పగలంతా షోరూం పనులలో బిజీగా ఉండే వంశీకృష్ణ రాత్రి పదింటికి ఇంటికి వస్తాడు. అత్తగారు ఇంటి పనులలో కోడలిని జోక్యం చేసుకోనిచ్చేవారు కాదు. వంటిల్లు ఆవిడ ప్రాణం. వంటింట్లోకి భానుమతిని అడుగుపెట్టనిచ్చేది కాదు. ఇంటి పెత్తనం కోడలి చేతికి వెళ్ళకూడదని, ఇంట్లో తనమాటే నెగ్గాలని ఆవిడ నిర్ణయం.

ఆ ఇంట్లో పెద్దగా పనిలేకపోవడంతో మూడు నెలలు గడిచేసరికి భానుమతికి రోజు గడవడం  కష్టమనిపించింది. పిజి చేసి చేతులు ముడుచుకు కూర్చుంటే చదివిన చదువుకు సార్ధకత ఉండదనిపించింది. ఉద్యోగం చేయాలని నిర్ణయించుకుంది.

"నేను ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటున్నాను. సమయం వృధాగా గడచిపోతోంది. నేను ఉద్యోగం చేద్దామనుకుంటున్నాను" ఆ రాత్రి భర్తతో చెప్పింది భానుమతి.

"నువ్వు ఉద్యోగం చేయడం నాకెంత మాత్రం ఇష్టంలేదు. నాన్నగారికీ ఇష్టం ఉండదు. అయినా ఇప్పుడు మనకు అంత అవసరం ఏముంది? నువ్వు అలాంటి ఆలోచనలు పెట్టుకోకు" కాస్త కోపంగా చెప్పాడు వంశీకృష్ణ.

"పోనీ మన షోరూముకు వచ్చి సేల్స్ సూపర్వైజ్ చేస్తాను. నాకు చేతనైన సలహాలు చెప్తాను. నాకు కాలం గడుస్తుంది. మీకు సహాయపడినట్లూ ఉంటుంది" అంటూ భర్తను ఒప్పించడానికి ప్రయత్నించసాగింది.

ఒక నిమిషం ఆలోచించిన వంశీకృష్ణ "సరే నీ ఇష్టం" అన్నాడు.

'హమ్మయ్య ' అనుకుని గుండెలపై చేయి వేసుకుంది భానుమతి.

మరుసటి రోజే భానుమతి "నిర్మల క్లాత్ షోరూం"లో అడుగుపెట్టింది. సరిగ్గా అదే సమయంలో నగరంలో రెండు పెద్ద షోరూములు వెలిశాయి. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన కంపెనీల షోరూమ్స్ సినీతారలు అట్టహాసంగా ప్రారంభించారు. భారీ డిస్కౌంట్స్, కేష్ ప్రైజుల ఆకర్షణలతో ప్రకటనలు హోరెత్తాయి. ప్రజల దృష్టి డిస్కౌంట్స్ వైపు మళ్ళింది. కస్టమర్స్‌తో నూతన షోరూములు కళకళలాడసాగాయి. నిర్మల క్లాత్ షోరూం సేల్స్ దారుణంగా పడిపోయాయి. తండ్రీ కొడుకులు ఆందోళన చెందసాగారు.

నెల రోజుల్లో సేల్స్ పరిస్థితి దారుణంగా దిగజారింది.

"నువ్వు మన షోరూములో అడుగుపెట్టావు. సేల్స్ పడిపోయాయి. నువ్వు ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటున్నానని గోలపెట్టావు. ఇప్పుడు మన షోరూములో అందరం గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునే పరిస్థితి వచ్చింది. కోటి రూపాయల స్టాకు కొనే నాధుడు లేడు. సరుకు సప్లయి చేసిన మిల్లులకు ఈ నెల చెల్లింపులు చేయలేం. డబ్బు కడితేకాని కొత్త స్టాకు రాదు.

ఈ రోజుల్లో కష్టమర్ల అభిరుచులు రోజు రోజుకూ మారుతున్నాయి. లేటెస్ట్ డిజైన్స్ తెప్పించకపోతే పాత సరుకు ఎవడూ కొనడు. అంతా నీవల్లే" అంటూ కోపంతో అరిచాడు వంశీకృష్ణ.

"నువ్వు కాలు పెట్టిన వేళ బాగోలేదు. నీది నష్టజాతకంలా ఉంది .అంతా మన ఖర్మ" నిందించాడు కృష్ణారావు.

"మన దురదృష్టం.. నీ తలరాత మా తలరాతను మార్చేసింది. ఐరన్ లెగ్ ప్రభావం" అంటూ తూలనాడింది నిర్మల.

మరో నాలుగునెలలు గడిచాయి. పరిస్థితిలో మార్పులేదు.

భానుమతి కనిపిస్తే ముఖం తిప్పుకుంటున్నాడు వంశీకృష్ణ.

అత్తమామలు కోడలిని ద్వేషించసాగారు. చేయని తప్పుకు కుటుంబ సభ్యులు తనని దోషిగా నిలబెట్టడంతో భానుమతి మన్స్తాపానికి గురయింది. ఆర్ధిక సమస్యలు ఇంటి సభ్యుల మధ్య కలతలు సృష్టించాయి. 'నిర్మలాభవన్ ' లో అశాంతి నెలకొంది.

ఆ రాత్రి భీమవరంలో ఉన్న తండ్రికి ఫోన్ చేసి సలహా అడిగింది భానుమతి.

"మా మామగారు చేస్తున్న వ్యాపారం దెబ్బతింది. వస్త్ర వ్యాపారంలో పోటీ తట్టుకోవడం కష్టంగా ఉంది. ప్రస్తుతం ఆర్ధిక ఇబ్బందుల్లో ఉన్నాం. కొత్త వ్యాపారం ప్రారంభిస్తే బాగుంటుందని నా అభిప్రాయం. నీ సలహా చెప్పు నాన్నా.." తండ్రిని అడిగింది భానుమతి.

"ఇంతకాలం నీ కుటుంబ ఆర్ధికస్థితి బాగుందని అనుకుంటున్నాను. నిజమే. వస్త్ర వ్యాపారంలో మల్టీ నేషనల్స్ ప్రవేశించాక పోటీ పెరిగింది. నా సంగతి తెలుసుగా. నా సంపాదన అంతా చేపల చెరువుల మీదే కదా. చేపల చెరువుల నిర్వహణలో అనుభవం ఉందిగాని మిగతా వ్యాపారాల మీద నాకు దృష్టిలేదు. వంశీకృష్ణ భీమవరం వస్తే చేపల చెరువులు లీజ్‌కు ఇప్పిస్తా. ప్రాన్ కల్చర్ కూడా ప్రారంభించవచ్చు. మీ మామగారితో మాట్లాడి ఒప్పించు" సలహా ఇచ్చాడు ప్రసాదరావు, భానుమతి తండ్రి.

ఆ రాత్రి డిన్నర్ చేస్తూ, భర్తకు తండ్రి ప్రపోజల్ వివరించింది భానుమతి.

"చేపల చెరువులంటే నాకు పెద్దగా ఆసక్తి లేదు. అనుభవం లేని వ్యాపారంలో ప్రవేశించి చేతులు కాల్చుకోలేం. అయినా పుట్టినప్పటి నుండి అలవాటైన ఊరు వదిలి రాలేను" అన్నాడు వంశీకృష్ణ.

"అలా అంటే ఎలా? పరిస్థితులు మారుతున్నాయి. ఈనాడు అనేకమంది పుట్టిన ఊరేకాదు. దేశాన్ని వదలి విదేశాలకు వెడుతున్నారు. ఎక్కడ ఉపాధి ఉంటే అక్కడకు మారడమే తెలివైనవాడు చేయవలసింది. విజయవాడ నుండి భీమవరం దగ్గరేకదా. మా నాన్నగారికి చేపల చెరువుల నిర్వహణలో అనుభవం ఉంది. ఆయన అనుభవం మనకు ఉపయోగపడుతుంది. మామయ్యగారు షోరూం చూసుకుంటారు. మనం భీమవరం షిఫ్ట్ అవుదాం" నచ్చచెప్పచూసింది భానుమతి.

కృష్ణారావుకు కోడలి సలహా నచ్చలేదు. చాలాసేపు కుటుంబ సభ్యుల మధ్య వాగ్వివాదం నడిచింది. చివరకు నిర్మల మెత్తబడింది. కోడల్ని సమర్ధించింది.

"ప్రస్తుతానికి ఇంతకన్నా మంచి ప్రపోజల్ మన దగ్గరలేదు. తండ్రి కొడుకు ఒకే వ్యాపారం చేయడం కన్నా వేరు వేరు వ్యాపారాలు చేస్తే రిస్క్ తగ్గుతుంది. మన అదృష్టం బాగుంటే కలిసొస్తుంది" అంటూ వంశీకృష్ణను భీమవరం వెళ్ళడానికి ఒప్పించింది.

మంచి రోజు చూసుకుని భీమవరంలో అడుగుపెట్టాడు వంశీకృష్ణ. అల్లుడిని సాదరంగా ఆహ్వానించాడు ప్రసాదరావు.

చేపల పెంపకంలో సాధక బాధకాలు వివరించాడు. నెలరోజులు మామగారితో కలిసి తిరిగాక వంశీకృష్ణకు చేపల చెరువుల నిర్వహణపై అవగాహన ఏర్పడింది. ప్రసాదరావు తన మిత్రులతో మాట్లాడి చేపల చెరువులు లీజుకు ఇప్పించాడు.

తన ఆస్తుల హామీపై అల్లుడికి బ్యాంకులోను మంజూరు చేయించాడు. మామగారి అండతో వంశీకృష్ణ ఉత్సాహభరితంగా పనిచేయసాగాడు.

రెండు నెలల తరవాత అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకుని భార్యను తీసుకు వచ్చాడు.

ఆరు నెలల తరవాత రొయ్యిల చెరువులు లీజుకు తీసుకున్నాడు. సంవత్సరం తరువాత మరికొంత బ్యాంకు లోన్ తీసుకుని పౌల్ట్రీ ఫాం ప్రారంభించాడు. ఆర్ధికంగా నిలదొక్కుకున్నాడు.

నాలుగు కేలండర్లు మారాయి. వంశీకృష్ణకి భీమవరంలో వ్యాపారం కలిసొచ్చింది.

నాలుగు సంవత్సరాలలో ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది భానుమతి.

తన దూరపు బంధువులు ఇల్లు అమ్ముతున్నారని తెలుసుకుని వంశీకృష్ణకి చెప్పాడు ప్రసాదరావు. మామగారి సలహాతో 'ఆనందనిలయం' స్వంతం చేసుకున్నాడు వంశీకృష్ణ.

"వస్త్ర వ్యపారంలో ఇప్పట్లో లాభాలు వస్తాయన్న ఆశలేదు. ఎన్ని సంవత్సరాలు నష్టాలు భరిస్తాం. షోరూం అమ్మేసి భీమవరం వచ్చేయండి. అందరం కలిసుందాం. కోళ్ళఫారం నిర్వహణ బాధ్యత మీరు తీసుకోవచ్చు" గృహప్రవేశానికి వచ్చిన మామగారికి, అత్తగారికి సలహా ఇచ్చింది భానుమతి.

కోడలి సలహా నిర్మలకు నచ్చింది.

"మనవలతో కాలం గడపాలన్న నా కోరిక తీరుతుంది. విజయవాడ నుండి భీమవరం వచ్చేద్దాం. అందరం కలిసుందాం" చెప్పింది నిర్మల. బాగా ఆలోచించి భీమవరం రావడానికి కృష్ణారావు అంగీకరించాడు.

నాలుగు నెలలలో షోరూంతోపాటు విజయవాడలో ఇల్లు అమ్మేసి భీమవరంలోని కుమారుని ఇంటికి చేరుకున్నారు కృష్ణారావు దంపతులు.

"వివాహం కాగానే నువ్వు మా ఇంటిలోకి వచ్చావు అప్పట్లో మా ఇంటి పెత్తనం నీ చేతుల్లోకి తీసుకుంటావేమోనని భయపడేదానిని. చివరికి మీ ఇంటికి మమ్మల్ని రప్పించుకున్నావు. అప్పట్లో మా ఇంటి పెత్తనం నీ చేతుల్లోకి తీసుకుంటావేమోనని భయపడేదానిని. చివరికి మీ ఇంటికి మమ్మల్ని రప్పించుకున్నావు. అప్పట్లో మీ మామగారి షోరూం మా అబ్బాయి సూపర్‌వైజ్ చేసేవాడు. ఇప్పుడు మా అబ్బాయి పౌల్ట్రీ ఫాం నీ మామగారు పర్యవేక్షించవలసి వస్తోంది. చూశావా రోజులెలా మారాయో.. మన స్థితిగతులని ఎంతలా మార్చాయో" నవ్వుతూనే అంటున్నా, నిర్మల మాటల్లో బాధను గమనించింది భానుమతి.

అత్తగారిని, మామగారిని సాదరంగా ఆహ్వానించింది. "ఇది మీ ఇల్లే అత్తయ్యగారూ మనందరం కలిసుందాం. విజయవాడలో ఎలా ఉన్నారో ఇక్కడా అలాగే ఉండండి. ఈరోజు నిండి ఇంటి నిర్వహణ బాధ్యత మీకప్పగిస్తున్నాను" అంటూ అత్తగారిని హృదయానికి హత్తుకుంది భానుమతి.

"నీవల్లే వ్యాపారం దెబ్బతిందని బాధపడుతున్న సమయంలో నువ్వే మాకో దారి చూపావు. ఈనాడు మనం ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. దీనికి నీ దూరదృష్టే కారణం" అంటూ కోడలిని అభినందించాడు కృష్ణారావు.

"ఆనాడు మన వస్త్ర వ్యాపారం దెబ్బ తినడానికి నేను కారణం కానట్టే ఈనాటి మన విజయానికి నేను మాత్రమే కారణం కాదు. నేను కేవలం నిమ్మిత్త మాత్రురాలిని" చెప్పింది భానుమతి.

"శాంతం, ఓరిమి నీకు అలంకారాలు. కష్టసమయంలో నన్ను పల్లెత్తు మాట అనకుండా సంనయనంతో వ్యవహరించావు. నీ సహృదయత, విజ్ఞత మన ఇంటి సౌభాగ్యం" అంటూ భార్యను ప్రశంసించాడు వంశీకృష్ణ.

'ఆనంద నిలయం'లో సంతోషం వెల్లివిరిసింది.

ఆ తరువాత కాలం పరుగెడుతున్నట్లు అనిపించింది భానుమతికి.

కొడుకు భాస్కరం ఎం.ఎస్ చేసి అమెరికా వెళతానన్నప్పుడు వంశీకృష్ణ వ్యతిరేకించినా, భాస్కరం కెరీర్‌కు అడ్డుపడకూడదని భర్తను ఒప్పించిన సంగతి గుర్తుకు వచ్చి భానుమతి పెదవులపై చిరునవ్వు మెరిసింది.

అరవై సంవత్సరాల జీవితంలో చేసిన తప్పులు, సాధించిన విజయాలు మనసును ముప్పిరిగొంటుంటే భళ్ళున తెల్లారింది.

గతం గతః అనుకుంటూ మిగిలిన కొద్ది రోజులు అర్ధవంతంగా గడపాలని నిర్ణయించుకుని మంచం దిగింది భానుమతి.

ఆరోజు నుండి పూజ పూర్తవగానే భగవద్గీత పారాయణం మొదలుపెట్టింది. భాగవతం పఠించసాగింది. మనసు నిర్మలంగా ఉంచుకుని భగవంతునిపై లగ్నం చేయసాగింది.

మూడు రోజుల తరువాత అమెరికా నుండి కుటుంబ సమేతంగా భాస్కరం వచ్చాడు. తల్లి పాదాలని స్పృశించిన కొడుకుని ఆశీర్వదించి హృదయానికి హత్తుకుంది.

"హమ్మయ్య.. వీడొచ్చేశాడు. ఇంక ఏ క్షణాన ప్రాణం పోతుందో అన్న బాధలేదు. అంత్యక్రియలకు ఆటంకం ఉండదు" అనుకుంటూ వేదాంతిలా నవ్వుకుంది.

కొడుకు దగ్గర కూర్చుని చెపుతున్న విశేషాలు వినసాగింది భానుమతి. మనుమలను దగ్గరకు తీసుకోబోయి ఆగిపోయింది. నాలుగురోజుల్లో ముగిసిపోయే జీవితం... అనుబంధాలు పెంచుకోకూడదనుకుంది. శరీరబాధను దిగమింగుకుంటూ మరో రెండు వరాలు గడిపింది.

ఆరోజు.. ఉదయం లేస్తూనే మనసులో చెప్పలేని ఆవేదన కలిగింది భానుమతికి. ఇల్లంతా కలియ తిరిగింది. ప్రతిగోడను ఆప్యాయంగా స్పృశించింది. పాతికేళ్ళ నుండి నివసిస్తున్న భవనం ప్రాణానికి ప్రాణంగా చూసుకున్న ఇల్లు.. శాశ్వతంగా వదలిపోవాలనుకుంటే గుండెల్లో బాధ పెల్లుబికింది. పెరట్లోకి నడిచింది. మామిడి చెట్టును కౌగలించుకంది. మల్లెమొక్కని ముద్దాడింది. చేమంతిని తడుముతూ మురిసిపోయింది. గులాబీని ఆఘ్రాణించింది. తన చేతులమీదుగా పెరిగిన మొక్కలతో తనివి తీరా ఊసులాడింది.

"పెరట్లో ఏం చేస్తున్నావు. నీకసలే చలిగాలి పడదు. లోపలికిరా" అంటూ భాస్కరం వచ్చి చేయిపట్టుకుని ఇంట్లోకి తీసుకువెడుతుంటే ఆగని కన్నీటిని పైట చెంగుతో తుడుచుకుంది భానుమతి.

ఆ రాత్రి .. ఎనిమిది గంటల ప్రాంతంలో డాబామీదకు వెళ్ళి పూర్ణచంద్రుని చూస్తూ పెళ్ళయిన కొత్తలో పున్నమినాడు వెన్నెల కాంతిలో భార్యతో గడిపిన మధురమైన రోజులు గుర్తుకు తెచ్చుకున్నాడు వంశీకృష్ణ. బహుశా భానుమతి మరో పున్నమి చూడలేకపోవచ్చు" అనుకంటూంటే మనసు బాధగా మూలిగింది.

భర్త డాబా మీద ఉన్నాడని తెలుసుకుని భానుమతి డాబా మీదకు వచ్చింది.

"మన పెళ్ళయిన కొత్తలో డాబా మీద వెన్నెల్లో మన సరాగాలు గుర్తున్నాయా" అన్నాడు వంశీకృష్ణ భార్య వైపు చూస్తూ.

"ఎలా మరచిపోగలను. అయినా అదంతా గతం. సుఖదుఃఖాలు మనిషి వెన్నంటే ఉంటాయి. ఏదీ శాశ్వతం కాదని గ్రహించలేకపోవడమే మన దౌర్బల్యం. అందరి జీవితాలు ఒకేలా నడవవు. ఒకేలా ముగియవు" చంద్రుని వైపు చూస్తూ

తత్వం చెపుతున్న భానుమతి వైపు ఆశ్చర్యంగా చూశాడు వంశీకృష్ణ. గతం గుర్తు తెచ్చుకుని కన్నీరు కారుస్తున్న భార్య కన్నీళ్ళు తుడిచాడు భర్త. భానుమతిని ఓదార్చసాగాడు. భార్య వెన్ను నిమిరి ధైర్యం చెప్పాడు వంశీకృష్ణ.

ఇంతలో పెద్ద శబ్దం వినపడింది. వారి ఇంటి ప్రక్కనున్న పెంకుటింట్లోంచి మంటలు ఎగసిపడడం చూసిన భార్యాభర్తలు కంగారు పడ్డారు.

"అయ్యో.. పక్కింటి పాండురంగారావు గారి ఇంట్లోంచి మంటలు. ఆయన తల్లి అనారోగ్యంతో బాధపడుతోంది. వారి నాలుగేళ్ళ చిన్నారి నన్ను అమ్మమ్మా అని పిలుస్తుంది. వారెలా ఉన్నారో.. చూద్దాం పదండి" అంటూ మెట్లు దిగుతున్న భానుమతిని వంశీకృష్ణ అనుసరించాడు. ఇంతలో భాస్కరం ఇంట్లోంచి వచ్చాడు. ముగ్గురూ గేటు తీసి రోడ్డు మీదకు వచ్చి పక్క ఇంటివైపు కదిలారు. రోడ్డు మీద జమ పోగవుతున్నారు. వివరాలు తెలుసుకుంటే గ్యాస్ సిలిండర్ పేలి మంటలు లేచాయిట. పెంకుటిల్లు కావడంతో వన నీరు ఇంట్లోకి కారకుండా పెంకులపై కప్పిన టార్పాలిన్, ఇంటి ముందు వేసిన తాటాకు పందిరి మంటలు త్వరత్వరగా వ్యాపించడానికి కారణమట. సిలిండర్ పేలిన శబ్దానికి పాండురంగారవు తల్లి స్పృహ తప్పితే ఆయన తన తల్లిని చేతులపై ఎత్తుకుని గబగబా బయటకు తీసుకు వచ్చి కూలబడ్డాడుట.

ఆ వెనకే ఆయన భార్య పరుగెత్తుకు వచ్చిందట. ఇంట్లో నాలుగేళ్ళ చిన్నారి ఉండిపోయిందట. భార్యాభర్తలు లోనికి వెళ్ళే సాహసం చేయలేకపోతున్నారు. మంటలు ఎగసిపడుతుంటే ఆవేదనతో ఆ పాప తల్లి గుండెలు బాదుకుంటూ విలపిస్తోంది.

రోడ్డు మీదకు చేరిన జనంలో ఎవ్వరూ మంటల మధ్య ఇంట్లోకి వెళ్ళడానికి సాహసించడంలేదు. కొందరు యువకులు మండుతున్న ఇంటిని సెల్‌ఫోన్లలో వీడియో తీసి స్నేహితులకు ఫార్వర్డ్ చేస్తున్నారు.

భానుమతి ఒక్క క్షణం ఆలోచించింది. తన జీవితం కొద్దిరోజుల్లో ముగిసిపోబోతోంది. ఎంతో భవిష్యత్తు ఉన్న పాపను రక్షించగలిగితే తన జీవితానికో సార్థకత చేకూరుతుందని భావించింది. "ఆడపిల్లకు జన్మనిద్దామన్న కోరిక తీరలేదు. ఈ పాపను అగ్నికీలలనుండి కాపాడి బ్రతుకునిస్తాను" అనుకుంటే ఆమె మాతృ హృదయం ఉప్పొంగింది. "అమ్మమ్మా.. నన్ను రక్షించవూ" అని చిన్నారి పిలుస్తున్నట్లనిపించింది. మరుక్షణం భర్త, కుమారుడు వారిస్తున్నా పట్టించుకోకుండా గబగబా అడుగులు వేస్తూ మంటల మధ్య నుండి ఆ ఇంట్లోకి అడుగుపెట్టింది భానుమతి. బెడ్‌రూములో దిక్కు తోచక భయంతో విలపిస్తున్న చిన్నారిని సమీపించింది. మంచం మీద దుప్పటి తీసి పాపకు చుట్టబెట్టింది. తన చీరకు నిప్పంటుకున్నా తొట్రుపడక పాపను భుజంపై ఎత్తుకుని పరుగులాంటి నడకతో ఇంటి బయటకు వచ్చి పాపను నేలపై దించి దుప్పటి తొలగించింది. పాప క్షేమంగా ఉందని గ్రహించి భర్తవైపు తిరిగి చేతులు జోడించింది. భానుమతి శరీరం అగ్నికి ఆహుతి అవుతుంటే పాప తల్లిదండ్రులు చేతులెత్తి మొక్కారు. ఆ దృశ్యం చూస్తున్న జనం అచేతనులై నిలబడ్డారు.

భోరున విలపిస్తూ కూలబడిపోయారు వంశీకృష్ణ, భాస్కరం. గణగణమని గంటలు మ్రోగించుకుంటూ ఫైరింజన్ అక్కడకు చేరుకుంది.

★★★

COMMENTS